క్లుప్తంగా

దేవరకు ఆహ్వానం



మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నందవరం : మండల పరిధిలోని నాగలదిన్నెలో ఈ నెల 7వ తేదీన జరిగే గ్రామ దేవర ఉత్సవానికి రావాలని మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రకోట జగన్ మోహన్‌రెడ్డిలకు నాగలదిన్నె వైఎస్సార్‌సీపీ నాయకులు రాజేష్‌కుమార్ శెట్టి, కేతం నాగప్ప, రంగారెడ్డి, వీరేష్‌లు సోమవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. వారు మాట్లాడుతూ..7వ తేదీ బుధవారం గ్రామ దేవరలో భాగంగా కుంభోత్సవం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఈరన్నశెట్టి, తిమ్మప్ప, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

సర్వేను పకడ్బందీగా చేయాలి



మాట్లాడుతున్న జిల్లా సంచార చికిత్స కార్యక్రమ నోడల్ అధికారి

ఎమ్మిగనూరుటౌన్: వ్యాధులపై కేటాయించిన వార్డుల్లో అసంక్రమిత వ్యాధులపై సర్వే పకడ్బందీగా చేయాలని జిల్లా సంచార చికిత్స కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ రఘు సూచించారు. సోమవారం పట్టణంలో శిల్పా ఎస్టేట్‌లో ఆరోగ్య కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 18 సంవత్సరాలు దాటిన వారికి షుగర్, రక్తపోటు, క్యాన్సర్, మానసిక రోగ పీడితులను స్క్రీనింగ్ పరీక్షలు చేయాలని సూచించారు. మహిళల్లో గర్భాశయ ముఖ ద్వార, రొమ్ము ఇతర క్యాన్సర్లను స్క్రీనింగ్‌లో గుర్తించాలన్నారు. తొలిదశలోనే ఆయా వ్యాధులను గుర్తిస్తే వాటిని నయం చేసే అవకాశం వుందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసబాబు, ఆరోగ్య విస్తరణ అధికారి విజయకృష్ణ, ప్రాజెక్టనిస్ట్ ఖలీల్,ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉరుకుందలో ప్రత్యేక పూజలు

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో స్వామి క్షేత్రం భక్తులతో సందడి నెలకొంది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున సుప్రభాత సేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. కొందరు భక్తులు తమ మొక్కులు తీర్చుకునేందుకు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు



కూరగాయలు విక్రయిస్తున్న దృశ్యం

కోసిగి: ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయాలు రుచికరమైన, నాణ్యమైన దిగుబడి వచ్చిందని, వాటిని ఆహారంగా తీసుకుని సంపూర్ణ ఆరోగ్యం పొందాలని ప్రకృతి వ్యవసాయ కొల్మాన్‌పేట యూనిట్ సభ్యుడు రాజమ్ అన్నారు. సోమవారం కోసిగి స్త్రీ శక్తి భవన కార్యాలయం ఆవరణలో కొల్మాన్‌పేట యూనిట్ ఆధ్వర్యంలో ప్రకృతి ద్వారా పండించిన కూరగాయాల ప్రదర్శన చేపట్టారు. ఆ సంస్థ సిబ్బంది, రైతులు కిష్టప్ప, నాగరాజు, , తాయన్న పాల్గొన్నారు.

నాటుసారా తరలిస్తే కేసులు



పట్టుబడిన బైక్, నాటుసారాతో ఎక్సైజ్ సీఐ సైదుల్

ఆదోని రూరల్: అక్రమంగా నాటుసారా తయారు చేసినా, అమ్మినా కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఎస్.కె.జె.సైదుల్ హెచ్చరించారు. సోమవారం పట్టణ శివారులోని మహాయోగి లక్ష్మమ్మవ్వ ఆర్చ్ వద్ద సారా తరలిస్తున్న నెరణికి తండాకు చెందిన పూజారి హరినాయక్‌ను సిబ్బంది పట్టుకునేందుకు యత్నించగా బైకు, సారా వదిలి పారిపోయాడన్నారు. బైకు, 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

గడ్డివాములు దగ్ధం

నందవరం : మండల పరిధిలోని సోమలగూడూరు గ్రామంలో సోమవారం రైతులు చిన్న జాను, చిన్న దేవదాసు చెందిన రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్, బీడీ తాగి నిప్పు పడేయడంతో పక్క పక్కనే ఉన్న గడ్డివాములకు మంటలు వ్యాపించాయి. స్థానికులు ఆర్పేందుకు ప్రయతి్నంచిన వీలుకాలేదు. సమాచారం ఇవ్వడంతో ఫైర్ ఆఫీసర్ రామాంజనేయులు, సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. దాదాపు రూ.80 వేలు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

వలస జీవుల బతుకు పోరాటం..!

- మధ్యప్రదేశ్ నుంచి ఎమ్మిగనూరుకు వలస వచ్చిన కార్మికులు
- వ్యవసాయ పనిముట్ల తయారీ, విక్రయం
- పిల్లాపాపలతో రోడ్డు పక్కనే జీవనం



మండుటెండలో నిప్పుల కొలిమిలో ముడి ఇనుమును సమ్మెటతో పనిముట్లుగా మలుస్తున్న కార్మికులు



తయారు చేసిన వ్యవసాయ పనిముట్లు, వంటపాత్రలను విక్రయించేందుకు రోడ్డు పక్కన ఉంచిన దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: ఓ వైపు మండుటెండ మరో వైపు బొగ్గుల నిప్పుల కొలిమి అందులో ఇనుప ముడిసరుకును ఎర్రగా కాల్చి సమ్మెటతో వ్యవసాయానికి కావాల్సిన పనిముట్లను తయారు చేస్తూ మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వలస జీవులు జీవనం కొనసాగిస్తున్నారు. కష్టాన్నే నమ్ముకున్న వలస జీవులు భాష, ప్రాంతంతో సంబంధం లేకుండా పట్టణంలో బతుకు సాగిస్తున్నారు. భాష రాకపోయినా 1,200 కిలోమీటర్ల దూరంలోని మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని రాజ్‌గడ్ జిల్లాలోని మన్‌టోడి గ్రామం నుంచి నాలుగు కుటుంబాలు పొట్ట చేతపట్టుకొని పట్టణానికి వలస వచ్చాయి.

ఇంటిల్లిపాది కష్టపడినా మిగిలేది అంతంత మాత్రమే

పట్టణంలోని కర్నూలు ప్రధాన రహదారిలో ఉన్న ఎద్దుల మార్కెట్ సమీపంలో రోడ్డు పక్కనే తాత్కాలిక టెంట్లలో జీవిస్తున్నారు. పిల్లాపాపలతో సహా తరలి వచ్చి ఆడ మగ తేడా లేకుండా ముడి ఇనుము తెచ్చుకొని, బొగ్గులతో నిప్పుల కొలిమిలో ఎర్రగా చేసి వాటిని సమ్మెటతో పనిముట్లను తయారు చేసి విక్రయించుకుంటున్నారు. ఇంటిల్లిపాది కష్టపడినా రోజుకు రూ.500ల నుంచి 1500ల వరకు వచ్చినా మిగిలేది ఏమీ లేదని ఆ కుటుంబాలకు చెందిన పెద్ద తేజ్ సింగ్ తెలిపాడు. తమ లాంటి పేదలకు ప్రభుత్వాలు ఆదుకుంటే తాము ఇంతదూరం పిల్లాపాపలతో పొట్టచేత పట్టుకొని ఎందుకొస్తామని, తమ జీవితాలు ఇంతే అని ఆవేదన వ్యక్తం చేశారు.

జీవనోపాధి కోసం వచ్చాం



మా ప్రాంతంలో ఎలాంటి జీవనోపాధి లేదు. అందుకే ముడి ఇనుముతో వ్యవసాయ పనిముట్లు తయారు చేసే వృత్తిని ఎంచుకున్నాం. అందుకే ఇంత దూరం వచ్చి ఎండకు ఎండుతూ జీవిస్తున్నాం. పగలంతా ఇంటిల్లిపాది కష్టపడినా తినడానికి తప్ప మాకు మిగిలేది ఏమి లేదు. వ్యవసాయ సీజన్‌లో కొనుగోళ్లు ఎక్కువగా వుంటాయి. లేక పోతే వచ్చిన దాంట్లోనే సర్దుకొని పోతూ ఊరూరు తిరుగుతూ బతుకు బండిని నడుపుకుంటున్నాం.

– గోవింద్, కార్మికుడు మధ్యప్రదేశ్

ఈ-కేవైసీ చేయించుకోండి

నందవరం : రేషన్ కార్డు దారులు ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలో 3,865 మంది కార్డుదారులు ఈ-కేవైసీ పెండింగ్‌లో ఉన్నారని తెలిపారు. వీఆర్వోలు ఈ- కేవైసీపై రేషన్‌కార్డు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ-కేవైసీ పూర్తి చేయకపోతే రేషన్ కోల్పోయే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరూచేయించుకోవాలన్నారు. ప్రభుత్వం జూన్ 30వ తేదీ వరకు గడువు పొడగించిందని, డీలర్ వద్ద లేదా ఆధార్ సెంటర్లలో ఈ-కేవైసీ చేయించుకోవాలని వివరించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌డీటీ మహేష్, డీటీ శశిధర్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

ఆదోని టౌన్: నియోజకవర్గంలో నెలకొన్న తాగునీటి సమస్యను అధికారులు పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ ఆదోని నియోజకవర్గ ప్రచార విభాగం అధ్యక్షుడు పరిగెల నారాయణ కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదోని మండలంలోని పెద్దపెండేకల్, చిన్నపెండేకల్, సాంబగల్లు, నెట్టేకల్, పాండవగల్లు తదితర గ్రామాల్లో నీటి సౌకర్యం లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. పట్టణంలో మురికివాడలు, శివారు ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులను ప్రజలు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

నేడు టెక్స్‌టైల్ పార్క్‌కు భూమిపూజ



భూమి పూజ స్థలంలో అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయం ఎదురుగా ఉన్న ఫారెస్ట్‌లో టెక్స్‌టైల్ పార్క్ భూమిపూజ కార్యక్రమంలో మంగళవారం జరగనుంది. ఈ మేరకు సోమవారం ఆ స్థలాన్ని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, జౌళిశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజు, తహసీల్దార్ శేషఫణిలు పరిశీలించారు. భూమిపూజ కార్యక్రమానికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరువుతన్నారని, ఎటువంటి పొరపాట్లు లేకుండా చూసుకోవాలని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ అధికారులకు సూచించారు. భూమి పూజ స్థలం, సభా కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. వీరితోపాటు ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు తదితరులు ఉన్నారు.

సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి



అర్జీలను స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం (పీజీఆర్‌ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పీజీఆర్‌ఎస్ నిర్వహించి డివిజన్‌లోని ఆయా మండలాల ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయాశాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్‌ఎల్‌ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వేయర్స్ శ్రీనివాసరాజు, వేణుసూర్య, ఇరిగేషన్ డిప్యూటీ ఇంజనీర్ షఫీవుల్లా, డీఎల్‌డీఓ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫంక్షన్‌హాల్ యజమానికి జైలు శిక్ష

ఆదోని అర్బన్: ఆదోని ఇంటర్నేషనల్ ఫంక్షన్‌హాల్ యజమాని అన్వర్‌బాషా అలియాస్ అనూకు ఆదోని అడిషనల్ జేఎఫ్‌డీఎం కోర్టు జడ్జి ఒక సంవత్సరం జైలుశిక్ష, రూ.10 వేలు జరిమానా విధించినట్లు టూటౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి సోమవారం తెలిపారు. 2017 సంవత్సరంలో జరిగిన పెళ్లి వేడుకలో ఫంక్షన్ హాల్‌లోని లిఫ్ట్ రోప్ తెగి పడటంతో అందులో ఉన్న ఓ వ్యక్తి చనిపోగా, ఇద్దరు గాయపడ్డారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ మహేశ్వరి వాదనలు వినిపించగా సోమవారం జడ్జి తీర్పునిచ్చినట్లు వెల్లడించారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

నందవరం : నిరుద్యోగ యువతీ యువకులు ఈ నెల 8న ఎమ్మిగనూరు జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ పుల్లయ్య సూచించారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో జాబ్‌మేళా కర పత్రాలను స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు ఎంపీడీఓకు అందజేశారు. 10వ తరగతి నుంచి డిగ్రీ చదివి, 18 ఏళ్ల నుంచి 40 సంవత్సరాల లోపు వయసున్న వారు అర్హులన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ సందీప్, ఏఓ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కౌతాళం చేరిన పాఠ్య పుస్తకాలు

కౌతాళం: మండలంలో విద్యార్థుల కోసం పాఠ్యపుస్తకాలు వచ్చినట్లు ఎంఈఓ-2 శోభారాణి తెలిపారు. మొదటి విడత కింద 33,078 పుస్తకాలు వచ్చాయన్నారు. నట్లు ఆమె తెలిపారు. మండలానికి మొత్తం 14588మంది విద్యార్థులకు గాను 74,500 పుస్తకాలు అవసరమని చెప్పారు.

ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకోవాలి

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని ఆర్టీసీ కాలనీ ప్రాంతంలో ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకోవాలని మాజీ కౌన్సిలర్ శ్రీనివాస ఆచారి సోమవారం మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఆర్టీసీ కాలనీలో ప్రభుత్వ స్థలాలు, పార్కులు, అన్యాక్రాంతమవుతున్నాయని, సర్వే నిర్వహించి స్వాధీనం వాటిని చేసుకోవాలని కోరారు.

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

ఎమ్మిగనూరురూరల్/టౌన్: తహసీల్దార్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి గోవిందు, నాయకులు రాముడులు డిమాండ్ చేశారు. సోమవారం పబ్లిస్ గ్రీవెన్స్‌లో తహసీల్దార్‌కు వినతి అందజేశారు. వారు మాట్లాడుతూ రైతులు, ప్రజలు, కార్మికులు పట్టాదారు పాస్ పుస్తకం, ఇతర సర్టిఫికెట్ల కోసం దరఖాస్తులు చేసుకుంటే అధికారులు కార్యాలయం చుట్టూ తిప్పుకుంటూ కాలయాపనలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు అబ్దుల్లా, రమేష్, కాలప్ప, మోహిన్, ఆటో బాషా తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి

ఆదోని టౌన్: మున్సిపల్ ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ స్వీపర్స్(ఆయాలు) వేతనాలను చెల్లించాలని ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్‌బాబు, జిల్లా సహాయ కార్యదర్శి ఓ.బి.నాగరాజు మాట్లాడుతూ ఎనిమిది నెలల నుంచి స్కూల్ ఆయాలకు జీతాలు అందడం లేదన్నారు. నాయకులు వెంకన్న, భీమేష్, రాజు, ఉసేని, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు ఏర్పాటు చేయాలి

ఆదోని రూరల్: పట్టణంలోని రైల్వేగేటు పక్కనున్న సాయినగర్ కాలనీలో విద్యుత్ తీగలు ఏర్పాటు చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి సుదర్శన్, సహాయ కార్యదర్శి విజయ్‌కుమార్, పట్టణ కార్యవర్గ సభ్యులు బేల్దారి రాముడు కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఏఈ రాజుకి కాలనీవాసులతో కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ దాదాపు కొన్ని సంవత్సరాల నుంచి 200 నిరుపేద కుటుంబాలు నివాసగృహాలు ఉన్నా మౌలిక సదుపాయాలు కల్పించలేదన్నారు కాలనీవాసులు గోపాల్, ఈరమ్మ, రేణుకమ్మ, లక్ష్మి, ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

పనికి తగ్గ వేతనం ఇవ్వాలి

పెద్దకడబూరు: కార్మికులకు పనికి తగ్గ వేతనం అందేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని ఏఐవైఎఫ్ నాయకులు డివిజన్ కార్యదర్శి జాఫర్‌పటేల్, సీనియర్ నాయకులు ఇస్మాయిల్, చంద్ర అన్నారు. మేడే కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలో సీనియర్ నాయకులు ఇస్మాయిల్ ఇంటి నుంచి బస్టాండ్ ఆవరణ వరకు ర్యాలీగా వచ్చి జెండాను అవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి వీరేష్, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆంజనేయ, నాయకులు గోపాల్, ఇర్ఫాన్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

నదిలోకి చేపల చెరువు నీరు వదిలితే చర్యలు



చేపల చెరువుల సిబ్బందితో మాట్లాడుతున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్

కోసిగి: మండల పరిధిలోని తుంబిగనూరు గ్రామ సమీపంలోని చేపల చెరువుల కెమికల్స్ కలిపిన నీటిని తుంగభద్ర నదిలోకి వదిలితే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. సోమవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన 'తుంగభద్రలోకి చేపల చెరువుల నీరు'అనే కథనానికి ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు ఎంపీడీఓ వెంకటేశ్వర్లుతో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తిమ్మరాజు, ఆదోని డివిజన్ మత్స్య శాఖ పర్యవేక్షకులు నాగరాజు, ఈఓపీఆర్డీ హారూన్ రషీద్‌లతో కలిసి తుంబిగనూరు గ్రామ సమీపంలోని చేపల చెరువులను సందర్శించారు. చెరువుల నీరు నదిలో కలుషితమయ్యే ప్రాంతాన్ని పరిశీలించారు. చెరువుల సిబ్బందితో మాట్లాడారు. నదిలో సాతనూరు ఎస్‌పీ స్కీమ్ వద్ద నీటిని శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. అందులో కెమికల్స్ కలిసినట్లు తేలితే శాఖ పరమైన ఉంటాయని హెచ్చరించారు. వీఆర్వో బాలస్వామి, ఫిషరీష్ అసిస్టెంట్ , సిబ్బంది ఉన్నారు.

సమీక్షతో అభివృద్ధికి శ్రీకారం



మాట్లాడుతున్న ఆదోని నూతన చైర్మన్ మహమ్మద్‌గౌస్

ఆదోనిటౌన్: మున్సిపాలిటీలోని విభాగాల సమీక్షతో అభివృద్ధికి శ్రీకారం చుడుతున్నట్లు ఆదోని మున్సిపల్ చైర్మన్ మహమ్మద్‌గౌస్ తెలిపారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూశాఖ, సచివాలయ అధికారులు, శానిటేషన్ సిబ్బంది, మేస్త్రీలు తదితరులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన మౌలిక సదుపాయాలు అందించడం, పారిశుద్ధ్యం పట్ల అవగాహన పెంచడం, వాటర్ సప్లై, రహదారి మరమ్మతులు, డ్రైనేజీ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అధికారులు, కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయో తెలుసుకుని వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వార్డుల స్థాయిలో ప్రజల అవసరాలను గుర్తించి ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. తాము ప్రజల నమ్మకంతో గెలిచామని, ఆ నమ్మకాన్ని నిలబెట్టేవిధంగా పని చేస్తామన్నారు. వైస్ చైర్మన్ నరసింహులు మాట్లాడుతూ సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేస్తేనే ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ప్రజల వరకు చేరతాయన్నారు. సమావేశంలో మున్సిపాలిటీ రెవెన్యూ ఆఫీసర్ నాసీర్‌హుసేన్, ఆర్ఐ షేక్షావలి, చంద్రమోహన్, ఆయాశాఖల ఇన్‌చార్జ్‌లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సంక్షిప్తం

అన్నదాన షెడ్ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

కౌతాళం: ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయం వద్ద నిత్య అన్నదానం షెడ్ నిర్మాణం కోసం బెంగళూరు వాస్తవ్యులైన కృష్ణవేణి వారి కుటుంబ సభ్యులు రూ.1,00,001 అందజేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలను, పూలమాల, స్వామి వారి శేష వస్త్రాలు, లడ్డులను, బాండును, ఫోటోను అందజేశారు.

మౌలిక వసతులు కల్పించాలి

ఆదోని రూరల్: పట్టణంలోని బాలాజీ, ఆదర్శ, షకీలా ఎస్టేట్‌లకు మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మండిగిరి పంచయతీకి చెందిన పై కాలనీలో గత పది సంవత్సరాలుగా నివాసం ఉంటున్నారని, అయినా కాలనీలకు తాగునీరు, మురుగునీరు కాలువలు, రోడ్లు ఏర్పాటు చేయలేదన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు వెంకప్ప, పీఓడబ్ల్యూ మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మణి, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు అఖండ, కాలనీవాసులు సిద్ధలింగ, ఈసన్న, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

లాక్రోస్ ఛాంపియన్‌కు అభినందనలు

కోసిగి: మండల పరిధిలోని డి.బెళగల్ గ్రామానికి చెందిన హుసేన్ సాబ్ ఏప్రిల్ 29 నుంచి ఈనెల 1వ తేదీ వరకు ఉత్తర ప్రదేశ్‌లో జరిగిన థర్డ్ నేషనల్ లాక్రోస్ చాంపియన్ షిప్‌లో ఆంధ్ర ప్రదేశ్ జట్టు నుంచి ఆడి ఉత్తమ ప్రతిభ కనబరిచి బ్రాన్జ్ మెడల్‌ను సాధించాడు. గ్రామీణ ప్రాంతం నుంచి జాతీయ స్థాయి లాక్రోస్ క్రీడల్లో మెడల్ సాధించడం పట్ల గ్రామస్తులు ఎం.రామయ్య, విద్యాకమిటీ చైర్మన్ తిక్కన్న, ఉసేని, కోచ్‌శివ, తదితరులు అభినందించారు.

వరి రైతులను ఆదుకోండి

కౌతాళం/ఆదోని రూరల్: అకాల వర్షాల వల్ల పంటలు దెబ్బతిన్న వరి రైతులను ఆదుకోవాలని, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరుతూ సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌కు రైతు సంఘం నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు వెంకటేశులు, మల్లయ్య మాట్లాడుతూ గత నెల ఆఖరు, ఈనెల 1, 2 తేదీల్లో వచ్చిన అకాల వడగండ్ల వర్షం వల్ల వరి ధాన్యం నేలపాలైందని, కల్లల్లో ఆరబెట్టిన ధాన్యం సైతం వర్షపునీటికి కొట్టుకుని పోయిందన్నారు. తడిసిన ధాన్యాన్ని వ్యాపారులు రూ.1400 నుంచి రూ.1600 వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి వరికి మద్దతు ధర రూ.2100 ప్రకారం కొనుగోలు చేయాలన్నారు. అలాగే నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.


ముందస్తు అడ్మిషన్లపై చర్యలు తీసుకోవాలి

కోసిగి: విద్యా సంవత్సరం ప్రారంభం కాకమునుపే ముందస్తు అడ్మిషన్ల పేరుతో అధిక ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్న కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రవేట్ పాఠశాలలు డోనేషన్లు, పుస్తకాలు, పేరుతో ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ అధిక వ సూళ్లకు పాల్పడుతున్నారన్నారు. నాయకులు పురుషోత్తం, జాని, గోపాల్, దేవపుత్ర, కరుణాకర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

ఎమ్మిగనూరుటౌన్: ఏపీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ మొండి వైఖరిని వీడి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రీజనల్ సహాయ కార్యదర్శి ఎస్‌పీఎం సాహెబ్, డిపో అధ్యక్ష,కార్యదర్శులు ఎస్ఎం రఫీక్, ముస్తక్ అహమ్మద్ డిమాండ్ చేశారు. సోమవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం వ్యక్తం చేశారు. అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దార్ శేషఫణికి అందజేశారు. వారు మాట్లాడుతూ.. 2019 జనవరి సర్క్యులర్ అమలు చేయాలని, ఉద్యోగులకు డబల్ డ్యూటీ అమౌంట్ పెంచాలని కోరారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థ ద్వారా వేతనాలు మంజూరు చేయాలని, ఉద్యోగులపై విధించే అక్రమ సస్పెన్షన్, రిమూవల్స్ నిలిపివేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ఎంఎల్ రెడ్డి, బజారప్ప,తిమ్మప్ప, గిరి,నాగరాజు, వలి, యూసుఫ్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి



క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరినాయుడు

ఆదోని టౌన్: శ్రీశైలం నుంచి తిరిగొస్తుండగా జరిగిన ప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరినాయుడు, నాయీబ్రాహ్మణ కుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శ్రీశైలం రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను సోమవారం వారు పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ ఆదోని పట్టణానికి చెందిన నాయీ బ్రాహ్మణ కులానికి చెందిన సుమారు 20 మంది బొలెరో వాహనంలో శ్రీశైలం దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. ప్రమాదంలో నలుగురు మృతిచెందారన్నారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. బీసీ ఫెడరేషన్ తాలూకా వైస్ ప్రెసిడెంట్ ఎస్.సి.రంగస్వామి, నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు, మంగళ ఆంజనేయస్వామి, ఆలయ ప్రెసిడెంట్ ఈరన్న, డ్రైవర్ సత్యన్న తదితరులు ఉన్నారు.

ముగిసిన ముద్దురంగా గురువుల ఆరాధనోత్సవం



ముద్దురంగా గురువుల మూల విరాట్‌ను పల్లకీలో ఊరేగిస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : పెద్దకడబూరు మండల కేంద్రంలో వెలసిన ఘనగురు దత్తాత్రేయ సంప్రదాయ వంశపరంపర గంజెళ్ల వెంకాటాగురు శిష్యుడైన ముద్దురంగా గురువుల 140వ ఆరాధన మహోత్సవం సోమవారం ముగిసింది. గంజెళ్ల వెంకటాగురువుల వంశస్తులైన శ్రీ కృష్ణమూర్తి స్వామిలవారి ఆశీస్సులతో నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం పీఠాధిపతులు ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. సాయంత్రం ముద్దురంగా గురువుల మూల విరాట్‌ను పల్లకీలో కూర్చొబెట్టి పురవీధులగుండా ఊరేగిస్తూ.. నందికోలసేవ చేపట్టారు. మహిళలు సాంప్రదాయ దుస్తులతో కలశాలను చేతబట్టి ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో మఠం రంగప్పస్వామి, మఠం శాంతమూర్తిస్వామి, మఠం బ్రహ్మేంద్రస్వామి, భక్తబృందం పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనులకు భూమిపూజ



బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని రూరల్: మండలంలోని పెద్దపెండేకల్ గ్రామం నుంచి 4 కి.మీ. మేర రూ.4 కోట్ల నిధులతో నూతన బీటీ రోడ్డు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. సోమవారం బీటీ రోడ్డు పనులకు భూమిపూజ చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ రోడ్డు వేయడం ద్వారా 4, 5 గ్రామాల ప్రజలకు నేరుగా కర్నూలు జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు దూరం కాస్త తగ్గి, ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆదోని పట్టణాన్ని అభివృద్ధి చేయడం ఎంత ముఖ్యమో గ్రామాల్లో కూడా అదేవిధంగా అభివృద్ధి చేయడం అనేది చాలా ముఖ్యమని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, టీడీపీ నాయకురాలు గుడిసె కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.